క్లుప్తంగా

మంచినీటి కుళాయిలు ప్రారంభం



కుళాయిలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి పరదేశిపాలెం, జగనన్న కాలనీల్లో నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను కార్పొరేటర్ దొలపల్లి కొండ బాబు సోమవారం ప్రారంభించారు. ఇప్పటికే ఈ జగనన్న కాలనీల్లో విద్యుత్ లైన్లు వేశామని, ఈ ప్రాంతంలో మొత్తం 40 మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలో ఈ కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ పాల రమణారెడ్డి , స్థానిక నాయకులు సాడి రమణ, ఎరుసు అప్పలకొండరెడ్డి, సన్యాసిరెడ్డి, రాసయ్య పాల్గొన్నారు.

ఉజ్వల పథకంతో నిరుపేదలకు మేలు



లబ్ధిదారుకు స్టౌ అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

ఆనందపురం : ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందించే ఉజ్వల పథకం వల్ల గ్రామీణులకు ఎంతో మేలు జరుగుతుందని గండిగుండం సర్పంచ్ గంర్రెడ్డి శ్రీనివాస్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద మంజూరు చేసిన ఉచిత గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు గ్రామంలో సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ మహిళలు పొగ బారిన పడకుండా ఉంటారని చెప్పారు. అర్హులందరికీ కనెక్షన్లు ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి మౌళాలి, పంచాయతీ సభ్యులు గంట్ల అచ్చిబాబు, రామకృష్ణ, కరకాని సత్తిబాబు, గంర్రెడ్డి నరసింహం పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు



మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని రేవిడి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ కంటుబోతు రాంబాబు సూచించారు. మండలంలోని రేవిడి పీహెచ్‌సీలో సోమవారం అభివృద్ధి మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో మంచి వైద్యం అందుతుందన్న నమ్మకం ప్రజల్లో కలిగేలా వైద్యం అందించాలన్నారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ఇప్పటికే రేవిడి పీహెచ్‌సీ కార్యాలయాన్ని మండల పరిషత్ నిధులతో ఆధునికీకరించామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాలాజీ, రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వైఎస్సార్ సీపీ నాయకులు కోన రమణ, మజ్జి శంకర్ పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే పూజ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మహిళకు కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు



తాతాజీనగర్‌లో సీఎం జగన్ స్టిక్కర్లు అందిస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

మధురవాడ: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, దీంతో ప్రజలంతా చాలా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ గణేష్‌నగర్ 66వ వార్డు సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయి, ప్రభుత్వంపై ప్రజలు ఎంత మేరకు సంతృప్తితో ఉన్నారు? తదితర అంశాలపై సర్వే చేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు వీధిలైట్లు, కాల్వలు తదితర సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంతటి అద్భుతమైన పాలన, సంక్షేమ పథకాలు జగనన్న ద్వారానే అందుతున్నాయని, మళ్లీ ఆయనను, తనను అంతా దీవించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, బెల్లాపు పాపారావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెంటడ్ర అప్పన్న, చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, ఎమ్‌వీ రమణమూర్తి, ఎన్.బాబ్జి, జేఎస్.రెడ్డి, అల్లాడ లింగేశ్వరరావు, పసుపులేటి గోపి పాల్గొన్నారు.

భీమునిపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఒక్కరికీ మేలు జరగడంతో మంచి భవిష్యత్ ఏర్పడుతోందని ఎగువపేట సచివాలయ కన్వీనర్లు అల్లిపిల్లి నర్సింగరావు, వాసుపల్లి కొండబాబు అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. గతంలో పేదలకు మేలు జరిగే ఒక్క పథకం కూడా ఎవరూ అమలు చేయలేదన్నారు. ఇప్పుడు అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా లబ్ధి చేకూరుతోందన్నారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం ఎవరూ నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్‌కు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు.



తన ఇంటికి స్టిక్కర్ అంటించుకుంటున్న వృద్ధుడు

కొమ్మాది: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నామని ప్రజలంతా చెబుతున్నారని కార్పొరేటర్ లొడగల అప్పారావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్ ... మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఇదే చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. జీవీఎంసీ 8వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. వార్డు ఇన్‌చార్జి ఉప్పులూరి గోపి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్‌కు విశేష స్పందన

తగరపువలస: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సోమవారం చిల్లపేటలో జరిగిన కార్యక్రమంలో చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, చిల్ల సూరిబాబు, డెక్కతి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఆదర్శనగర్‌లో సరగడ నాగిరెడ్డి, చేట్ల నరసింగరెడ్డి, జీరు పద్మ, మద్ది మహాలక్ష్మి పాల్గొన్నారు. చిట్టివలసలో అక్కరమాని రామునాయుడు, జీరు సుజాత, నీలాపు రామిరెడ్డి, జీరు శ్రీనివాసరెడ్డి, భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ తాతాజీనగర్‌లో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు తదతరులు పాల్గొన్నారు.



చిల్లపేటలో సర్వేలో గృహసారథులు, కన్వీనర్లు



ఆదర్శనగర్‌లో మహిళా కన్వీనర్ల సర్వే



చిట్టివలసలో లబ్ధిదారుకు కరపత్రం అందిస్తున్న అక్కరమాని రామునాయుడు, తదితరులు

రూపేష్ యాత్ర స్ఫూర్తిదాయకం

తగరపువలస: సేవ్ నేషన్, సేవ్ యూత్, సేవ్ ఎర్త్ నినాదంతో గుజరాత్‌కు చెందిన అథ్లెటిక్ రూపేష్ మక్వానా చేపట్టిన పరుగు యాత్ర యువతకు స్ఫూర్తిదాయకమని భారత స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు టి.ఎస్.వి.ప్రసాదరావు అన్నారు. ఈ పరుగు యాత్ర సోమవారం జిల్లా సరిహద్దులు దాటి శ్రీకాకుళం వరకు సాగిందని ఆయన పేర్కొన్నారు. రోజుకు 70 కిలోమీటర్ల వంతున 95 రోజుల్లో 6 వేల కిలోమీటర్ల ఈ పరుగు యాత్ర సాగుతుందన్నారు. జిల్లా సరిహద్దులో రూపేష్‌కు ట్రస్ట్ ప్రతినిధులు సాయి నాగేశ్వరరావు, ప్రభాకర్ తదితరులు వీడ్కోలు పలికారు.

విద్యుత్ కాంతుల్లో శంఖు, నామ, చక్రాలు



కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం కొండపై గల శంఖు, నామ, చక్రాల విద్యుత్ లైట్లు వర్షాలు కారణంగా గత మూడు నెలల నుంచి పని చేయడం లేదు. ఇటీవల టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆలయ పరిశీలనకు వచ్చినప్పుడు వాటిని గమనించి వెంటనే మరమ్మతుల చేయించాలని ఆలయ అధికారులను ఆదేశించారు. దీంతో ఈ శంఖు, నామ, చక్రాల లైట్లకు మరమ్మతులు చేయించారు. మరలా విద్యుత్ కాంతుల్లో ఇవి దర్శనమిస్తుండడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

కార్మికుల బకాయిలు పూర్తిగా చెల్లించాల్సిందే



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న అల్లు బాబూరావు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు బకాయిల చెల్లింపు విషయంలో యజమాని బజోరియా అబద్ధాలు చెబుతున్నారని ఐక్య కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. సోమవారం ఉదయం మిల్లు ఆవరణలో కాంగ్రెస్ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లడుతూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో కార్మికులకు ఇప్పటి వరకు రూ.32 కోట్ల చెల్లింపులు చేయగలిగామన్నారు. ఇంకా 400 మంది కార్మికులకు పీఎఫ్ చెల్లించలేదన్నారు. కార్మికులకు బజోరియా పూర్తిగా చెల్లింపులు చేపట్టేవరకు వదిలిపెట్టబోమని హెచ్చరించారు. మారుపేరు కార్మికులకు న్యాయం చేయకుండానే యాజమాన్యం దొంగచాటుగా భూములు అమ్ముకుంటుందన్నారు. బకాయిలు ఉన్న కార్మికుల జాబితాలను కార్మిక సంఘాల నాయకులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల బకాయిల విషయంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కార్మిక సంఘాలు కలిసి ఈ నెల 19న జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో సమావేశం కానున్నట్టు తెలిపారు. దల్లి అప్పలరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అల్లు బాబూరావు, మునకాల ఆదినారాయణ, చిల్ల ఆదినారాయణరెడ్డి, కొండపు ఈశ్వరరావు, మద్దుల గురుమూర్తి, సరగడ ఈశ్వరరావు, తమ్మిన కూర్మారావు, చిల్ల అప్పలసూరి, నరవ రామారావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



మజ్జివలస హైస్కూల్‌లో అవగాహన కలిగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తగరపువలస: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది భీమిలి మండలం మజ్జివలస హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కలిగించారు. భవనాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు, ఎవరైనా నీట మునిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రథమ చికిత్స విషయాలు వివరించారు. అగ్నిమాపక శాఖాధికారి జి.శ్రీనివాసరాజు, సిబ్బంది జి.ఎస్.కె.రెడ్డి, జి.శ్రీను, సీహెచ్ విజయభాస్కర్, తిరుపతి ప్రసాద్, జి.జగన్నాథరావు, బి.రామకృష్ణ, సీహెచ్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, కె.చక్రవర్తి, బి.రాము, బి.బంగార్రాజు, సీహెచ్‌వీఆర్ మూర్తి, పి.వెంకటరావు, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం తగదు



కాలనీ, పార్కు మ్యాపులు చూపుతున్న బింద్రానగర్ కాలనీ వాసులు

మధురవాడ: పార్కులు, కాల్వలు, గెడ్డల పరిరక్షణలో నిర్లక్ష్యం తగదని షిప్‌యార్డు లే అవుట్ బింద్రానగర్ కాలనీకి చెందిన బింద్రానగర్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. ఇక్కడి పార్కు ఆక్రమణపై ఏళ్ల తరబడి తిరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. అలాగే ఎస్ఎఫ్ఎస్ స్కూలు వద్ద కొందరు వ్యక్తులు గెడ్డని ఆక్రమించడమే కాకుండా ప్రవాహ దిశను కూడా మార్చేస్తున్నా చర్యలు చేపట్టడం లేదని అసోసియేషన్ ప్రతినిధులు ఏఎమ్ ప్రసాద్, ఈశ్వరరావు, రమేష్‌బాబు వాపోయారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో కమిషనర్ కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 12 అర్జీలు వచ్చాయి. జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో వంద గజాలలోపు ఇంటికి ప్లాన్ తీసుకుని, 14 శాతం అపరాధ రుసుం చెల్లించి ఇల్లు నిర్మించుకుంటే ఇంటి పన్ను వేసేందుకు ఆర్ఐ 9 నెలలుగా తిప్పుతున్నారని యజ్జవరపు రంగబాబు వాపోయారు. 100 గజాలలోపు వీఎల్‌టీ అవసరం లేదని, వెంటనే ఇంటి పన్ను వేయాలని ఆర్ఐని జెడ్సీ ఆదేశించారు.

- విశాలాక్షినగర్ శ్రీ భక్త తుకారాం కాలనీలో 33 ఏళ్ల క్రితం నిర్మించిన రామాలయం ఆవరణలో వెటర్నరీ కాలనీ వల్ల డ్రైనేజీ వ్యవస్థ లేక చిన్నపాటి వర్షానికి కూడా వర్షం నీరు నిల్వ ఉండిపోతోందని ఎం.శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు.
- కొమ్మాది కూడలి నుంచి పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వరకు హైవేని ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌పై స్లాబుకు మరమ్మతులు చేయించాలని బీవీ కృష్ణయ్య, ఎస్ఎస్ నాయుడు, శాఖరి శ్రీనుబాబు, పోతిన తిరుమలరావు కోరారు. అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని కనక మహాలక్ష్మి హామీ ఇచ్చారు.

జిందాల్ ఎనర్జీ ప్లాంట్ పరిశీలన



సంగివలస చెరువు వివరాలు తెలుసుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

మధురవాడ: మధురవాడ జోన్‌లోని కాపులుప్పాడ డంపింగ్ యార్డుని జీవీఎంసీ కమిషనర్ సీఎమ్ సాయికాంత్ వర్మ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడి జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ని సందర్శించి, కార్యకలాపాలు అన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ప్లాంట్‌కి ఎంత చెత్త అవసరం.. జీవీఎంసీ నుంచి ఎంత ఇస్తున్నారు.. ఎంత ఉపయోగిస్తున్నారు.. మిషనరీ పనిచేసే విధానం.. ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది తదితర అన్ని విషయాలు ఆరా తీశారు. జీవీఎంసీ నుంచి జిందాల్ ప్లాంట్‌కు 1200 టన్నుల చెత్త ఇస్తున్నామని, 15 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని, 13.7 మెగా వాట్లు ఏపీ ట్రాన్స్‌కో ఆనందపురం గ్రిడ్‌కి సరఫరా చేస్తున్నట్టు జీవీఎంసీ అధికారులు, జిందాల్ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, జోన్ – 2 కమిషనర్ కనక మహాలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెరువు ముఖద్వారాల పరిశీలన

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంగివలస చెరువును సోమవారం ఉదయం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులతో కలిసి పరిశీలించారు. వర్షం నీరు, నేషనల్ హైవే డ్రైనేజీల మురుగు రోజుల తరబడి సర్వీస్ రోడ్డుపై నిలిచిపోవడంతో అందిన ఫిర్యాదు మేరకు ఆయన ఇక్కడకు వచ్చారు. ఆయనకు భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, భీమిలి జెడ్సీ బి.రాము, ఇరిగేషన్, మత్స్యశాఖ, ఎండోమెంట్ అధికారులు సమస్యను మ్యాప్‌ల ద్వారా వివరించారు. సంగివలస కాలనీవైపు చెరువు అవుట్‌లెట్లు ఎత్తు చేయడంతో సర్వీస్ రోడ్డుపై నిలిచిన నీరు లోపలికి వెళ్లే అవకాశం లేకుండా పోయిందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు కమిషనర్ చెరువుకు సంబంధించిన అన్ని విభాగాల అధికారులతో సాయంత్రం మరోమారు జీవీఎంసీలో సమావేశం కానున్నందున వారిని రావాల్సిందిగా సూచించారు.

జీరో యూనిట్ల విద్యుత్ వినియోగానికి రూ.1581 బిల్లు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంగివలసలోని కోల వెంకట విజయలక్ష్మి ఇంటికి ఈ నెల 4న తీసిన విద్యుత్ మీటర్ రీడింగ్‌లో సున్నా యూనిట్లకు రూ.1581 బిల్లు పంపించి చిట్టివలస సబ్‌స్టేషన్ అధికారులు షాకిచ్చారు. ఆమెకు మూడు ఫ్లోర్లకు సంబంధించి మూడు విద్యుత్ మీటర్లు ఉన్నాయి. వీటిలో ఒక మీటర్ గత నెలలో పని చేయకపోవడంతో వినియోగదారునికి సమాచారం ఇవ్వకుండా కొత్తది మార్చారు. ఇటీవల రీడింగ్‌కు వచ్చిన తర్వాత కూడా విద్యుత్ వినియోగం జరగకపోవడంతో మీటరు సున్నా యూనిట్లు చూపించింది. అయినప్పటికీ మినిమం బిల్లుకు బదులుగా రూ.1581 పంపించడంతో వినియోగదారు రెండు వారాలుగా సబ్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సోమవారం మారో మారు సబ్‌స్టేషన్ జూనియర్ అకౌంటెంట్‌ను విజయలక్ష్మి సంప్రదించగా మధురవాడ కార్యాలయంలో బిల్లు సవరించుకోవాలని పంపించేశారు.

బాలికా విద్యపై దివీస్ సైకిల్ ర్యాలీ



దివీస్ యాజమాన్యం అందించిన సైకిళ్లతో విద్యార్థినులు

తగరపువలస: లింగ వివక్షను అరికట్టి బాలికా విద్యను ప్రోత్సహించడానికి విద్యార్థినులకు దివీస్ లేబొరేటరీ సైకిళ్లు అందిస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ దివి మధుసూదనరావు తెలిపారు. భీమిలి మండలం చిప్పాడ లేబొరేటరీలో చిప్పాడ, మూలకుద్దు, పెదనాగమయ్యపాలెం, అన్నవరం, తూడెం పంచాయతీల్లోని 190 మంది విద్యార్థినులకు రూ.12.79 లక్షల విలువైన సైకిళ్లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారితో ర్యాలీ చేపట్టారు. అనంతరం చిప్పాడ సుత్తమ్మతల్లి ఆలయం వద్ద పర్యావరణ పరిరక్షణ, భద్రతపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ దేవేంద్రరావు, రమణ, జనరల్ మేనేజర్లు ఎం.ఎస్.ఎన్.రావు, వైఎస్ కోటేశ్వరరావు, ఇ.రామకృష్ణ, డీజీఎం బాలాజీ, భద్రత అధికారి చంద్రశేఖర్, సీఎస్ఆర్ అధికారులు నరసింహ, ఇ.ఎస్.నాగరాజు, డి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

“మట్టిని ఇంకా తొలగించలేదా?”



ఏడాది క్రితం డ్రైనేజీ నిర్మాణానికి తవ్విన మట్టిని పరిశీలిస్తున్న జెడ్సీ రాము

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంగివలస కాలనీలో ఏడాది క్రితం డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్విన మట్టి ఇప్పటి వరకు తొలగించకపోవడంతో జెడ్సీ బొడ్డేపల్లి రాము సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లాప్ కార్యక్రమంలో భాగంగా కాలనీలో పర్యటించినప్పుడు స్థానికులు మట్టి విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన ఎమినిటీస్ కార్యదర్శి, వర్క్ ఇన్‌స్పెక్టర్లను ప్రశ్నించగా మౌనమే సమాధానమయింది. దీంతో జెడ్సీ మాట్లాడుతూ మీరు పనిచేస్తున్నట్టా..? ఆడుకుంటున్నట్టా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన అక్కడకు వచ్చి గంట సేపయినా ఏఈ సుమన్ రాకపోవడంతో ఫోన్‌లోనే వార్నింగ్ ఇచ్చారు. తక్షణం మట్టి తొలగించకపోతే మీ వేతనాల నుంచి కట్ చేసి ఆ డబ్బులతో మట్టి తొలగించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాంట్రాక్టర్ ప్రసాదరాజుకు ఎన్నిసార్లు చెప్పినా మట్టి తొలగించడం లేదని సిబ్బంది వాపోయారు. అనంతరం అక్కడి మహిళలకు దోమల నివారణపై అవగాహన కలిగిస్తుండగా సచివాలయ సిబ్బంది నుంచి సరైన స్పందన లేకపోవడంతో వారిపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా సిబ్బంది పనితీరు మారడం లేదన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మి నాయుడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



నారాయణ పాఠశాల వద్ద అసంపూర్తిగా వదిలి పెట్టిన కాలువ



వెల్లంకి, వేములవలస గ్రామాల మధ్య సర్వీసు రోడ్డు పక్కన ప్రమాదకరంగా మారిన కాలువ

ఆనందపురం : ఆరులేన్ల రహదారి నిర్మాణంలో భాగంగా ఇరువైపులా నిర్మించిన సర్వీసు రోడ్లు కాంట్రాక్టరు నిర్లిప్తతతో ప్రమాదకరంగా మారాయి. కాలేవల నిర్మాణంలో నాణ్యత లోపించడంతో పలు చోట్ల నిర్మించిన కొన్ని రోజులకే శిథిలమవుతున్నాయి. దీంతో వాహన చోదకులు అయోమయానికి గురవుతున్నారు.

- వేములవలస నుంచి తగరపువలస వైపు వెళ్లే సర్వీసు రోడ్డు పక్కన గల కాలువలను అసంపూర్తిగా నిర్మించి, విడిచి పెట్టేశారు. దీంతో అవి ప్రస్తుతం ప్రమాదకరంగా మారాయి. వెల్లంకి గ్రామానికి సమీపంలో సుమారు 40 మీటర్ల వరకు కాలువపై వేసిన పలకలు పూర్తిగా శిథిలమైపోయాయి. ప్రస్తుతం అక్కడ కాలువ మాత్రమే మిగిలింది. దీంతో వాహనచోదకులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా అందులో పడి ప్రమాదాలు బారిన పడుతున్నారు. భారీ వాహనం అదుపు తప్పి పలకలపైకి చేరుకోవడంతో పలకలు పూర్తిగా దెబ్బ తిన్నాయి.
- ఇదే మార్గంలో నారాయణ పాఠశాల వద్ద కాలువను అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. దీంతో అక్కడ చెత్త పేరుకుపోయి మురుగు కూపంగా మారింది. అక్కడ రోడ్డు కూడా లోతట్టుగా ఉండడంతో వాహనాలు అందులోకి ఒరిగి, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- పెందుర్తి వెళ్లే రూట్లో దిబ్బడిపాలెం, శొంఠ్యాం, మామిడిలోవ, కణమాం గ్రామాల వద్ద ఇదే పరిస్థితి ఉందని వాహన చోదకులు అంటున్నారు. కాలువలు అధ్వాన స్థితిలో ఉండడం వలన, ముఖ్యంగా రాత్రి వేళ ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గ్రామ సభ నిర్వహించాలి

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో ఈ నెల 14న నిర్లక్ష్యంగా గ్రామ సభ నిర్వహించిన వారిపై చర్యలు తీసుకుని మళ్లీ గ్రామ సభ నిర్వహించాలని కోరుతూ కలెక్టరేట్ స్పందనలో వార్డు మెంబర్ మహంతి అప్పలరమణ సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ముందస్తు సమాచారం లేకపోవడం వల్ల గ్రామ ప్రజలు సమస్యలు చర్చించుకోలేకపోయారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. సర్పంచ్, ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు, 14 మంది వార్డు మెంబర్లు, 5600 మంది పైగా జనాభా ఉన్న పంచాయతీలో సర్పంచ్, ఒకటి, రెండో వార్డుల మెంబర్లు, ఒక వీధికి చెందిన 13 మంది మహిళలతో గ్రామ సభ జరిపారని తెలిపారు.

లయన్స్ ఉప గవర్నర్‌గా సూర్యప్రకాష్

బీచ్‌రోడ్డు: రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్ జిల్లా ఉప గవర్నర్–2గా దిగపల్లి సూర్యప్రకాష్ సోమవారం నియమితులయ్యారు. క్లబ్ ద్వారా సూర్యప్రకాష్ అందించిన సేవలను గుర్తించి జిల్లా కమిటీ ఆయనను ఎంపిక చేసింది. ఉత్తరాంధ్రలోని క్లబ్‌ల ద్వారా మరిన్ని సేవలు అందిస్తామని సూర్యప్రకాష్ తెలిపారు.